అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- గతంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు
- మరమ్మతులు చేపట్టని అధికారులు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు



కొత్తగూడ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత



కోతకు గురైన దేగామ, ఇచ్చోడ ఆర్అండ్బీ రోడ్డు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంతో పాటు గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. గతేడాది వర్షాలకు రోడ్లు దెబ్బతిని గుంతలు, కోతకు గురయ్యాయి. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. సంవత్సరం గడిచినా.. అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో మాత్రం చలనం లేదు. రాత్రి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం, గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు కాలువలు, వాగులు పొంగి పొర్లడంతో గ్రామాలకు వెళ్లే రహదారులు దెబ్బతిన్నాయి. ఇలాంటి రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు. మండలంలో 30 గ్రామపంచాయతీల పరిధిలో 64 గ్రామాలున్నాయి.

తప్పని ప్రయాణ కష్టాలు..

గతేడాది కురిసిన భారీ వర్షాలతో దేగామ, ఇచ్చోడ ఆర్అండ్బీ రోడ్డులో బోస్రా, రాంపూర్, దిగ్నూర్, గంగాపూర్, లక్ష్మన్‌నాయక్‌తండా సమీపంలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రాంపూర్ సమీపంలో వాగు ఉధృతికి రోడ్డు కోతకు గురికావడంతో పెద్ద గోయ్యి ఏర్పడింది. రాత్రి సమయంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. భూతాయి రోడ్డులో డేద్ర, మాన్కపూర్, ఉమార్డ, ఇంద్రనగర్, చందునాయక్‌తండా, భూతాయి(కె) గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. కనీసం రోడ్లపై గుంతలు పూడ్చే నాథుడే కరువయ్యారు. కొత్తగూడ, అందుగూడ, కొత్తపల్లి, హర్కాయి, రాజులగూడ, రతన్‌గూడ గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బతినడంతో ట్రాక్టర్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

మరమ్మతులు చేస్తాం

మండలంలో భారీ వర్షాలకు ఆర్అండ్బీ రోడ్లు, పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. రెండు విభాగాలకు నివేదించాం. నిధుల మంజూరైతే గుంతలను పూడ్చి, మరమ్మతులు చేపడుతాం. నిధుల మంజూరులో ఆలస్యమైతే రోడ్లను గ్రామపంచాయతీల నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– చౌహాన్ రాధ, ఎంపీడీవో బజార్‌హత్నూర్

గుంతలు పూడ్చాలి

మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లే రహదారిలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయాల్లో ప్రయాణం చేయాలంటే భయంగా ఉంది. మళ్లీ వర్షాకాలం ప్రారంభం కానుండడంతో రోడ్డు మొత్తం కోతకు గురయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గుంతలు పూడ్చివేయాలి.

– అర్క దత్తాత్రేయ, కొత్తగూడ

ప్రజారోగ్యానికి పెద్దపీట



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాపురావు

బోథ్: ప్రజారోగ్యానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించే నూతన ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అనంతరం ×రాజకీయ వృత్తి× అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, సర్పంచ్ సురేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాణ్‌సింగ్, వైస్ ఎంపీపీ లింబాజీ, సంజీవ్ రెడ్డి, తాహెర్ బిన్ సలాం, ఎలుక రాజు, సుభాష్, జగన్ రెడ్డి, పోశెట్టి పాల్గొన్నారు.

సత్‌సంగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో ప్రతి ఆదివారం నారాయణ్ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే సత్‌సంగ్ కార్యక్రమంలో ఆదివారం ఉదయం ఎమెల్యే రాథోడ్ బాపురావు పాల్గొని మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా క్రమం తప్పకుండా సత్‌సంగ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, రాథోడ్ ప్రకాశ్, ప్రవీణ్, దాసరి భాస్కర్, ముస్తాఫా పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఎంపీ రమేశ్

ఉట్నూర్‌రూరల్: రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో మండల సమావేశం నిర్వహించారు. ముందుగా పార్లమెంట్ కోకన్వీనర్ మయూర్ చంద్ర జాకటేతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకోవడం గర్వకారణమన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టేసిందని, ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్, మండల అధ్యక్షుడు రాజశేఖర్, నంది రెడ్డి, జానకిబాయి, ఆడే ధనలాల్, భాగ్యలక్ష్మి, లింగాగౌడ్, శేషరావు, రామచందర్, దేవిదాస్, రాజేశ్వర్, సంతోశ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించాలి

తలమడుగు: రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని లాల్‌ఢగ గ్రామంలో సమావేశం నిర్వహించారు. తెలంగాణలో బీజేపీ విజయం సాధించే దిశగా ప్రతీ కార్యకర్త కష్టపడాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొనగిరి స్వామి, ముత్యాల దేవన, ధనుంజయ్, అశోక్ పాల్గొన్నారు.

మహా సంపర్క్ అభియాన్ విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 30 నుంచి నిర్వహించనున్న మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి కోరారు. ఆదివారం మావల మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రవిరెడ్డి, రవి యాదవ్, గంగారెడ్డి, ఉష్కం రఘుపతి, భూమేష్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాటలు ప్రజలు నమ్మరు

- ఎమ్మెల్యే జోగు రామన్న



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

కైలాస్‌నగర్: ప్రతిపక్ష నాయకులు చెప్పే మాయ మాటలను ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని 40వ వార్డు పరిధిలో సీసీరోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు కనీస మౌలిక వసతులను కల్పించడంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు విఫలమయ్యాయని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదిలాబాద్ పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్ భరత్, రాంకుమార్, కుమ్రరాజు పాల్గొన్నారు.

ఆసుపత్రికి గుర్తింపు రావడం అభినందనీయం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఆసుపత్రికి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు రావడం అభినందనీయమని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్ అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ముస్కాన్ టీం ఆసుపత్రిని సందర్శించడం జరిగిందన్నారు. ఉత్తమ సేవలు అందించి, ఉత్తమ సేవ పురస్కారం రావడానికి కృషి చేసిన ఆసుపత్రి సుపరింటెండెంట్ ఉపేందర్‌ను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, లంబాడా జేఏసీ నాయకులు నారాయణ, సురేశ్ రెడ్డి పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో ఎంపీటీసీ నిధులతో డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపిస్తున్నందున మురుగు నీరు ఇంటిలోకి చేరకుండా పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మునీర్, సులేమాన్ యాషై, సత్యం, కోమటిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి

ఆదిలాబాద్‌టౌన్: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లూరి రాజారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రఫీక్, ప్రభాకర్, రాజేశ్వర్, ఓమన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణ అర్హత కార్డులివ్వాలి



రైతులతో కలిసి మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

బోథ్: కౌలు రైతులను గుర్తించి ప్రభుత్వం రుణ అర్హత కార్డులు మంజూరు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. ఆదివారం మండలంలోని కనుగుట్ట, పొచ్చెర గ్రామాల్లో కౌలు రైతుల వివరాలను సేకరించారు. అకాల వర్షాలు కురిస్తే పంట నష్ట పరిహారం కూడా రావడం లేదన్నారు. 2011లో కౌలు రైతు రుణాల చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుబంధు, రైతుబీమా అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు భీమరాజు, బద్దం రాజారెడ్డి, కుమ్మరి గంగయ్య, బొజ్జ నరేష్, చట్ల స్వామి, ఆశన్న పాల్గొన్నారు.

సన్మానం

ఉట్నూర్‌రూరల్: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ 2023 ఏడో వార్షికోత్సవం సందర్భంగా మండల కేంద్రానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు, కవి కట్ట లక్ష్మణచారిని ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలోని పది రాష్ట్రాలకు చెందిన విశ్వ బ్రాహ్మణ లెజెండరీలను సన్మానించడం జరిగిందన్నారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ అధ్యక్షుడు పుష్పగిరి, విజయవాడ సంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



పోచ్చమ్మ ఆలయం వద్ద మహిళలు

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీఏటా ఖరీప్ సీజన్ ప్రారంభానికి ముందు పూజలు నిర్వహిస్తారు. తాంసి, గిరిగాం, పొన్నారి, హస్నాపూర్, వడ్డాడి, కప్పర్లతో పాటు భీంపూర్ మండలంలోని పిప్పల్‌కొటి, నిపాని, వడూర్, అర్లి(టి), అంతర్గాం గ్రామాల్లో పూజలు చేశారు. పోచ్చమ్మ, సర్గమ్మ, మహలక్ష్మీ దేవతలకు బోనాలు సమర్పించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు.

వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బేల: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం కార్మికశాఖ, సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో లేబర్‌కార్డు ఉన్న కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఒక్కొక్కరికీ 50 రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సీఎస్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ సయ్యద్ పర్వేజ్ తెలిపారు. లేబర్‌కార్డు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ కేర్ క్యాంప్ కోఆర్డినేటర్ అబ్దుల్ ఖదర్ సుఫీ, సామాజిక కార్యకర్తలు వెంకన్న, హరీశ్, రితేశ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆదివారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మండలంలోని చించ్‌ఘాట్, మాలేబోరిగామ గ్రామ పంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్, పెందూర్ సోనేరావు, శ్రీకాంత్, కాశీరాం, జగతిరావు, అశోక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న ఎంపీపీ గంద్రత్ రమేశ్

ఎదులాపురం: రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ విషయంలో ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సరికాదని ఆదిలాబాద్ రూరల్ మండల ఎంపీపీ గంద్రత్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. రేణుక సిమెంట్ ఫ్యాక్టరీకి ఎమ్మెల్యే జోగు రామన్న ఎలాంటి సంబంధం లేదన్నారు. రాజకీయంగా లబ్ది కోసమే బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

రాజదండం మ్యూజియంలో పెట్టాలి



మాట్లాడుతున్న జగన్‌సింగ్

ఎదులాపురం: సెంగోల్ (రాజదండం) మ్యూజియంలో పెట్టాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్‌సింగ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రజాపంథా కార్యాలయంలో మాట్లాడారు. సెంగోల్ (రాజదండం) అనేది రాచరికం, భూస్వామ్యవాదాలకు ప్రతీక అన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరితో మళ్లీ రాచరిక విధానాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వందల కోట్లు ఖర్చు చేసి పార్లమెంటు భవనాన్ని కట్టిన మోదీ రాజదండం పేరుతో ప్రజలను మళ్లీ రాచరికం వైపు మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు ఖడ్గాన్ని పార్లమెంటులోకి తీసుకురావడమే నిదర్శనమన్నారు. బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. అందుకు ప్రజా సంఘాలు, ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి ఉమ్రే నితిన్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్ — ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



బేల: కాప్సి(బి) 11కేవీ విద్యుత్ లైన్ స్తంభాలు బేల శివారులోని పొలాల్లో ప్రమాదకరంగా మారాయి. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్తంభాలను సరిచేయించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: సంతోశ్, ఏఈ, ట్రాన్స్‌కో, ఫోన్: 83339 23874

అపూర్వ సమ్మేళనం



బోథ్: పాల్గొన్న పూర్వ విద్యార్థులు



తాంసి జిల్లా పరిషత్ పూర్వ విద్యార్థులు

బోథ్/తాంసి: పదో తరగతి చదివి 25 ఏళ్ల తరువాత అందరూ ఒకచోట కలిశారు. బోథ్ మండలంలోని కౌట (బి) జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, తాంసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ.. సరదాగా గడిపారు. ఆనాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మనోహర్

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం అంబేద్కర్ భవనంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సోన్‌కాంబ్లే మనోహర్, ఉపాధ్యక్షుడిగా పవార్ శివాజీ, ప్రధాన కార్యదర్శిగా వాగ్మారే కామ్‌రాజ్, సహాయ కార్యదర్శిగా వాగ్మారే సూర్యకాంత్, కోశాధికారిగా కాంబ్లే సునీల్ విజయం సాధించారు. అనంతరం పోలింగ్ బూత్ కేంద్రం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఉట్నూర్‌రూరల్: స్థానిక గిరిభవన్‌లో అంబేద్కర్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా వాగ్మారే జగ్జీవన్, ఉపాధ్యక్షుడిగా కాంబ్లే ప్రజ్ఞశీల్, కుటికెల ఆశన్న, ముకుంద్‌రావు, బొకంటి సుభాశ్‌లను ఎన్నుకున్నారు. దళితుల సమస్యలపై పోరాటం చేస్తామని, జాతిఐకత్యకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభుజ్యోతి ఆదివారం ప్రకటనలో తెలిపారు. జూన్ 1న బీఎస్సీ (ఎంపీసీ), ఎంఎస్‌సీఎస్, బీకాం కంప్యూటర్‌లో జూన్ 2న బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీలో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు టెన్త్ మెమో, ఇంటర్ హాల్ టికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, పాస్ ఫొటోలు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలన్నారు.

'డబుల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధి'



మాట్లాడుతున్న ఆడే మానాజీ

నేరడిగొండ: డబుల్ ఇంజన్ సర్కారుతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మానాజీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మన దేశం సూపర్ పవర్ దిశగా అడుగులు వేస్తుందన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన నడుస్తుందని ఆరోపించారు. రానున్న రోజుల్లో సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో మండల ఇన్‌చార్జి మాధవరావు ఆమ్డే, మండల అధ్యక్షుడు సోసయ్య హీరాసింగ్, బంటు ప్రవీణ్, జితేందర్ ఉత్తమ్, జాదవ్ పరశురాం, గట్టు నారాయణ, రాథోడ్ ఉద్దల్ సింగ్, వెంకటేశ్, రాఘవులు, జమీర్, విష్ణు పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండల కేంద్రానికి చెందిన పోశెట్టి తల్లి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట తూము సూర్యం, సోలంకి సాయి, భరత్, తదితరులు ఉన్నారు.

బహిరంగ సభ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆదివాసీలు

బోథ్: జనజాతి సురక్షమంచ్ ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీల మైదానంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని న్యాయవాది పంద్రం శంకర్ పిలుపునిచ్చారు. మండలంలోని నక్కలవాడ, కొత్తపల్లె, రేండ్లపల్లె గ్రామాల్లో గ్రామస్తులతో కలిసి సభకు పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ కార్యదర్శి దుర్వ విశ్వేశ్వర్, సార్మెడి గంగారాం, కొత్తపల్లె పటేల్, కనక గంగారాం, కనక అమృత్, ఉప సర్పంచ్ జ్యోతక్క, కోశేరావ్, మనోహర్ పాల్గొన్నారు.

'వసతుల కల్పనలో ఎమ్మెల్యే విఫలం'



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పించడంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న విఫలమయ్యారని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సి.రాంచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గంద్రత్ సుజాత, అంబకంటి అశోక్, సంజీవ్‌రెడ్డి, భూపెల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

అన్నదానం

కైలాస్‌నగర్: పట్టణంతో పాటు వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే పరిసర ప్రాంతాల ప్రజల ఆకలిని తీర్చేందుకు సంగెం ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. ఆది వారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు సుధాకర్, 108 ఉద్యోగి ప్రదీప్ హాజరై వడ్డించారు. కార్యక్రమంలో న్యాయవాది సుధీర్ కుమార్, మహేందర్ రెడ్డి, సలీమ్, శుభాష్, పవన్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.